రబీ సాగు రెట్టింపు

- చెరువులు, బోర్లలో సమృద్ధిగా నీరు
- సాగులోకి వచ్చిన 3,130 హెక్టార్లు
- ఆశాజనకంగా వివిధ పంటలు



సాగులో ఉన్న వేరుశనగ

మడకశిరరూరల్: గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది రబీ సీజన్‌లో పంటల సాగు గణనీయంగా పెరిగింది. నియోజకవర్గ వ్యాప్తంగా రికార్డు స్థాయిలో రైతులు వివిధ పంటలు సాగు చేశారు. గతంలో రబీ సీజన్‌లో ఇంతస్థాయిలో పంటలు సాగు కావడం చూడలేదని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. నియోజకవర్గంలోని మడకశిర, అగళి, రొళ్ల, అమరాపురం, గుడిబండ మండలాల పరిధిలో వేరుశనగ, వరి, రాగి, మొక్కజొన్న, పత్తి, మిరప, పప్పుశనగ తదితర పంటలు సుమారు 3,130 హెక్టార్లలో సాగయ్యాయి. గత ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడం, చెరువులు, కుంటలు నీటితో నిండటంతో భూగర్భ జలాలు పెరిగాయి. దీంతో రైతులు వివిధ పంటలు సాగు చేయడానికి మొగ్గు చూపారు. ప్రస్తుతం సాగు చేసిన పంటలకు తెగుళ్లు ఆశించలేదు. పంటలు పచ్చగా కళకళలాడుతున్నాయి. పంట దిగుబడి కూడా ఆశాజనకంగా ఉండటంతో రైతులు సంతోషంగా ఉన్నారు. మడకశిర వ్యవసాయశాఖ డివిజన్ పరిధిలో రబీలో బోరు బావుల కింద వరి 120 హెక్టార్లు, వేరుశనగ 2,250 హెక్టార్లు, రాగి 340 హెక్టార్లు, పప్పుశనగ 25 హెక్టార్లు, పత్తి 39 హెక్టార్లు, మిరప 26 హెక్టార్లలో పంటలు సాగయ్యాయి.

ఆరెకరాల్లో మొక్కజొన్న సాగు



బోరు బావుల కింద ఆరు ఎకరాల్లో సాగు చేసిన మొక్కజొన్న పంట కొత దశలో ఉంది. ఎకరాకు రూ.18 వేల చొప్పున పెట్టుబడి అయ్యింది. పంట ఆశాజనకంగా ఉండటంతో ఎకరాకు 30 క్వింటాళ్లకు పైగా దిగుబడి వచ్చే అవకాశం ఉంది. మద్దతు ధర అధికంగా ఉండటంతో ఖర్చులన్నీ పోనూ రూ.40 వేలకు పైగా ఆదాయం వస్తుంది. – శ్రీరామరెడ్డి, ఎల్లోటి, మడకశిర మండలం

సూచనలిస్తున్నాం..



భూగర్భ జలమట్టం పెరగడంతో రైతులు ఉత్సాహంగా పంటలు సాగు చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా పంటల సాగు విస్తీర్ణం పెరగడం శుభపరిణామం. గతంలో ఈ స్థాయిలో పంటలు సాగు ఎప్పుడూ లేదు. పంటలకు తెగుళ్లు సోకకుండా రైతులకు సూచనలు, సలహాలు ఇస్తున్నాం. నివారణ చర్యలు చేపడుతున్నాం. – కృష్ణమీనన్ ఏడీఏ, మడకశిర

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం



మడకశిరరూరల్: మాట్లాడుతున్న లోక్ అదాలత్ ఆఫీసర్ శ్రీధర్

హిందూపురం: రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించుకుంటే వివాదాలు దూరమై ప్రశాంత జీవనానికి అవకాశం ఉంటుందని హిందూపురం ఏడీజే శైలజ అన్నారు. శనివారం స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో ఏడీజే ఆధ్వర్యంలో మూడు బెంచ్‌ల న్యాయమూర్తులు స్పందన, రాజ్యలక్ష్మి మెగా లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా 184 కేసులను పరిష్కరించారు. కేసుల పరిష్కారంతో కక్షిదారులకు సంబంధించి రూ.1,15,65,644 నగదు ఇప్పించారు.

దారి సమస్యకు పరిష్కారం..

ఏళ్ల తరబడి వివాదాస్పదంగా ఉన్న వీరంపల్లి గ్రామ రహదారి సమస్య ఏడీజే చొరవతో పరిష్కారమైంది. చాలాకాలంగా పట్టా పొలం గుండా వీరంపల్లి గ్రామ దారి ఉండటంతో ఆ పొలం యాజమాని అడ్డు చెప్పడంతో సమస్యగా మారింది. ఈ సమస్యతో పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరిగి వ్యయప్రయాసలకు గురయ్యారు. దీనిపై స్పందించిన ఏడీజే రాజీమార్గంలో కేసు పరిష్కరించుకోవాలని సూచించారు. ఇరువర్గాలతో చర్చించి సమస్యను పరిష్కరించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ న్యాయమూర్తికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏపీపీ నగేష్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగప్ప, కార్యదర్శి సుదర్శన్, లోక్ అదాలత్ సభ్యులు సిద్ధ, కళావతి, కృష్ణమూర్తి, పార్వతి, ఫణి భూషణ్, చెన్నప్ప, శారద హేమావతి తదితరులు పాల్గొన్నారు.

61 కేసుల పరిష్కారం..

మడకశిరరూరల్: స్థానిక జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో లోక్ అదాలత్ ఆఫీసర్ ఎం.శ్రీధర్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 61 కేసులను పరిష్కారించారు. లోక్‌అదాలత్ ఆఫీసర్ ఎం శ్రీధర్ మాట్లాడుతూ.. కక్షిదారులు కోర్టుల చుట్టూ సంవత్సరాల తరబడి తిరగకుండా సత్వరమే కక్షిదారులకు న్యాయం అందించడానికి లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కరించుకోవడానికి రాజీమార్గమే రాజమార్గమన్నారు. లోక్‌అదాలత్‌తో పరిష్కరించిన కేసులకు అప్పీల్ ఉండదన్నారు. అనంతరం లోక్‌అదాలత్‌లో రాజీ మార్గన 56 క్రిమినల్ కేసులను పరిష్కరించి రూ.39,600 జరిమానా, ఒక చెక్ బౌన్స్ కేసులో రూ.15 లక్షల లబ్ధి చేకూర్చారు. 4 బ్యాంకు కేసులను పరిష్కరించి రూ.1.23 లక్షలు బ్యాంకుకు చెల్లించినట్లు తెలిపారు.

పెనుకొండలో 207 కేసులు..

పెనుకొండ: కేసులు రాజీ చేసుకుని సంతోషంగా జీవించాలని సీనియర్ సివిల్ జడ్జి శంకరరావు పేర్కొన్నారు. పట్టణంలోని కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ.. సమస్యలతో గొడవ పడి కేసులు పెట్టుకోవద్దన్నారు. ఆ కేసులను రాజీ చేసుకోవడం ద్వారా సంతోషంగా జీవించవచ్చన్నారు. కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ మంచి వేదిక అన్నారు. మొత్తం 207 కేసులు పరిష్కారమైనట్లు కోర్టు వర్గాలు తెలిపారు. కార్యక్రమంలో ఏజీపీ భాస్కరరెడ్డి, చంద్రశేఖరరెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, నాగార్జున, మోహన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా ఆంజనేయుడి విగ్రహ ప్రతిష్ఠ



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శంకర నారాయణ

సోమందేపల్లి: మండలంలోని కేతగాని చెరువు గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర నారాయణ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం తీర్థ, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రామాంజనేయులు, వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ వెంకటరత్నం పాల్గొన్నారు.

జీవీ పాళ్యం చెరువు వేలం

మడకశిరరూరల్: మండల పరిధిలోని జీవీ పాళ్యం చెరువులో చేపల పెంపకానికి గ్రామ సచివాలయంలో నిర్వహించిన వేలం పాటలో శివప్రసాద్ అనే వ్యక్తి రూ.73,100 దక్కించుకున్నట్లు గ్రామ కార్యదర్శి ఈరలింగప్ప శనివారం తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కళావతి, ఈఓఆర్డీ శైలజ పాల్గొన్నారు.

నేడు దొనే సేవ

అమరాపురం: మండల పరిధిలోని తమ్మడేపల్లి గ్రామంలో వెలసిన మైలారలింగేశ్వరస్వామి ఆలయాల్లో ఆదివారం దొనే సేవ నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. దళిత, కురుబ కులస్తులు వేర్వేరుగా ఆయా ఆలయాల్లో వేడుకలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

నంది విగ్రహాన్ని వదలరా?

- టీడీపీ యువగళం పోస్టర్లు అతికించిన నాయకులు



కొడికొండ చెక్‌పోస్ట్‌లో నంది విగ్రహం దిమ్మెపై పోస్టర్లు అతికిస్తున్న దృశ్యం

చిలమత్తూరు: మండలంలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై కొడికొండ చెక్‌పోస్ట్‌లోని లేపాక్షి నంది సర్కిల్‌లో నంది విగ్రహం దిమ్మెకు టీడీపీ యువగళం పోస్టర్లు అతికించారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన లేపాక్షి వీరభద్ర స్వామి ఆలయం సూచికగా చెక్‌పోస్ట్‌లో టూరిజం శాఖ నంది విగ్రహాన్ని ఏర్పాటు చేసింది. అయితే కొందరు తమ ప్రచారాలకు నంది దిమ్మెను వినియోగించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దేవుళ్లపై ఏమాత్రం భక్తి భావం లేకుండా ఇలా బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించడం ఏమిటని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటు పంచాయతీ, టూరిజం శాఖ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. కాగా లోకేష్ చేపట్టిన పాదయాత్ర బేజారుగా సాగుతున్నా.. ఇంత ప్రచారం అవసరమా అంటూ ప్రజలు చర్చించుకుంటున్నారు.

పరామర్శ

మడకశిర: అమరాపురం మండలం హేమావతి వద్ద శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో హనుమంతనపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త శ్రీధర్ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి ఒక ప్రకటనలో తీవ్ర సంతాపం తెలిపారు. మృతుడి బంధువు, వైఎస్సార్‌సీపీ నాయకుడు కృష్ణారెడ్డిని ఫోన్‌లో పరామర్శించారు. ప్రమాదం ఎలా జరిగిందని అడిగి తెలుసుకున్నారు. మృతుడి కుటుంబాన్ని ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

యువకుడికి తీవ్ర గాయాలు

మడకశిర(అగళి): అగళి మండల సమీపంలోని మోడల్ స్కూల్ వద్ద శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరిగేపల్లి గ్రామానికి చెందిన రాజన్న అనే యువకుడు తీవ్ర గాయాల పాలయ్యాడు. బాధితుడు సైకిల్‌పై వెళ్తుండగా.. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. రాజన్నకు స్థానిక ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేశారు. మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో కర్ణాటక ప్రాంతం శిరా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వైభవంగా అడ్డ పల్లకీ ఉత్సవం



శనీశ్వరుడిని అడ్డ పల్లకీలో ఊరేగిస్తున్న దృశ్యం

పావగడ: స్థానిక శనీశ్వరుడి దేవాలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి శనీశ్వరుడి వెండి అడ్డ పల్లకీ ఉత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వందలాది మంది భక్తులు స్వామి రథానికి టెంకాయలు కొట్టి, పూజలు నిర్వహించారు. జ్యేష్ఠాదేవి సమేత శనీశ్వర స్వామి వెండి పల్లకీలో ఊరేగారు.

అమృత్ సరోవర్ పనుల పరిశీలన



కూలీలతో మాట్లాడుతున్న డ్వామా పీడీ రామాంజినేయులు

లేపాక్షి: మండలంలోని లక్కేపల్లి చెరువులో ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న అమృత్ సరోవర్ పనులను డ్వామా పీడీ రామాంజినేయులు శనివారం ఉదయం పరిశీలించారు. రూ.257 కూలి వచ్చేలా ఉపాధి సిబ్బంది పనులు కల్పిస్తున్నారా, ఉపాధి బిల్లులు పడుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆదేశాలతో పనులు కల్పిస్తున్నారని, అయితే పూర్తి బిల్లులు పడలేదని కూలీలు తెలిపారు. బిల్లులు మంజూరయ్యేలా చూడాలని పీడీకి విన్నవించారు. ఎన్ని క్యూబిక్ మీటర్లు లక్ష్యంగా పెట్టుకున్నారని, ఎంతమేరకు పనులు చేశారని తీశారు. మిగిలిన ఎన్ని రోజుల్లో పనులు పూర్తి చేస్తారని అడిగారు. 10 వేల క్యూబిక్ మీటర్లు పనులు చేయాలని లక్ష్యంగా ఎంచుకున్నామని, ఇప్పటి వరకు 2,300 క్యూబిక్ మీటర్లు పనులు చేపట్టామన్నారు. మిగిలిన పనులను రెండు నెలల్లో పూర్తి చేస్తామని పీడీకి సమాధానం ఇచ్చారు. ఉపాధి కూలీలు అందరు అమృత్ సరోవర్ పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీడీ శివానందనాయక్ పాల్గొన్నారు.

16న శ్రీకృష్ణదేవరాయల విగ్రహావిష్కరణ



విగ్రహావిష్కరణకు సంబంధించిన ఆహ్వాన పత్రికలు విడుదల చేస్తున్న దృశ్యం

హిందూపురం: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఈనెల 16వ తేదీన శ్రీకృష్ణదేవరాయల జయంతిని పురస్కరించుకుని శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నట్లు ఏపీ ఆగ్రోస్ చైర్మన్ నవీన్‌నిశ్చల్ తెలిపారు. శనివారం ఆగళిలో జరిగిన బలిజ సంఘం ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. శ్రీకృష్ణదేవరాయులు జయంతిన రోజునే హిందూపురంలో అట్టహాసంగా విగ్రహా ఆవిష్కరణ మహోత్సవాన్ని చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమానికి కర్ణాటక, ఏపీలోని బలిజ కుల బంధవులు, నాయకులు కార్యక్రమానికి హాజరవుతారన్నారు. జిల్లాలోని బలిజ కులబంధవులందరూ పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు. బలిజలందరూ అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలని ఇందుకు ఐక్యంగా కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో హిందూపురం, అగళి బలిజ సంఘనాయకులు పాల్గొన్నారు.

జేడీఎస్ గెలుపునకు పాదయాత్ర

పావగడ: స్థానిక విధానసభ క్షేత్రం జేడీఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కేఎం తిమ్మరాయప్ప గెలుపు కోసం అతని వీరాభిమాని గుజ్జనడు ఆర్ భీమప్ప తాలూకా వ్యాప్తంగా పాదయాత్ర నిర్వహిస్తున్నారు. శుక్రవారం కదిరేపల్లి గ్రామంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించి పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. అక్కడి నుంచి కోడిగేనహళ్ళి, క్యాతగానహళ్ళి, లింగదహళ్ళి, పెమ్మనహళ్ళి, సాసలకుంటె గ్రామాల మీదుగా శనివారం ఓబుళాపురం గ్రామానికి చేరుకున్నారు. రంగసముద్రం, దొడ్డేనహళ్ళి గ్రామాల్లో పాదయాత్ర నిర్వహిస్తూ ప్రజలకు మాజీ సీఎం కుమారస్వామి అమలు చేసిన రైతుల రుణ మాఫీ పథకంతో పాటు పలు సంక్షేమ పథకాల గురించి వివరించారు. మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప తాలూకా వ్యాప్తంగా చేపట్టిన అభివృద్ధి పనులను తెలిపారు. వచ్చే ఎన్నికల్లో జేడీఎస్ అభ్యర్థి తిమ్మరాయప్పను గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో సాసలకుంటె గ్రామ పంచాయతీ అధ్యక్షుడు చిత్తయ్య, ఉపాధ్యక్షుడు మోహన్ కుమార్, మాజీ అధ్యక్షుడు అంజనరెడ్డి తదితర జేడీఎస్ నాయకులు పాల్గొన్నారు.

శాసనాన్ని కాపాడాలని వినతి



మంత్రి రోజాకు వినతిపత్రం అందిస్తున్న పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఉపేంద్రరెడ్డి

హిందూపురం: విజయనగర సామ్రాజ్యం వైభవానికి గుర్తుగా 500 సంత్సరాల కాలం నాటి శాసనాన్ని కాపాడాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక క్రీడలు యువజనాభివృద్ధి శాఖ మంత్రి ఆర్కే రోజాను రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఉపేంద్రరెడ్డి, చిలమత్తూరు వైఎస్సార్‌సీపీ నాయకుడు అమరన్నాథ్ రెడ్డి కోరారు. శనివారం విజయవాడలో మంత్రి రోజాను వారు మర్యాదపూర్వకంగా కలిశారు. హిందూపురం మండలం చలివెందల గ్రామంలోని కొండపై విజయనగర సామ్రాజ్య వైభవానికి గుర్తుగా భారతదేశంలో అతిపెద్ద శాసనాన్ని చెక్కారని తెలిపారు. శాసనం ఉన్న కొండ చుట్టూ కొందరు బండరాళ్ల కోసం పగుల కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో దేశంలోనే పెద్ద శాసన నాశనం అయ్యే ప్రమాదం ఉందన్నారు. శాసనాన్ని కాపాడుకునేందుకు చుట్టూ కంచెతో పాటు కొండ బండరాళ్లు పగులగొట్టడానికి వీలు లేకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం వారు మంత్రికి వినతిపత్రం అందజేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయమే లక్ష్యం

మడకశిర: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి వైఎస్సార్‌సీపీ తరఫున బరిలో ఉన్న వెన్నపూస రవీంద్రారెడ్డి గెలుపునకు కష్టపడి పని చేయాలని ఎమ్మెల్యే తిప్పేస్వామి కోరారు. శనివారం సాయంత్రం ఎమ్మెల్యే తన గృహంలో పార్టీ మండల కన్వీనర్ రామిరెడ్డి, మాజీ ఎంపీపీ బజ్జప్ప, పలువురు సర్పంచులు తదితర నాయకులతో సమావేశమయ్యారు. ఎమ్మెల్సీ ఎన్నికలపై చర్చించారు. మార్చి 13న పోలింగ్ జరుగుతుందన్నారు. మడకశిర నియోజకవర్గంలో భారీ మెజార్టీ సాధించాలని కోరారు. గ్రామస్థాయిలో ఓటర్లను కలిసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి ఓటు వేసేలా చూడాలని కోరారు.

శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబు

చిలమత్తూరు: మండలంలోని కొడికొండ గ్రామం చిత్రావతి నది ఒడ్డున వెలసిన పురాతన పంచనందీశ్వరాలయం మహాశివరాత్రికి ముస్తాబవుతోంది.. ఆలయానికి రంగులు వేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. జనమేజయుడు ప్రతిష్ఠించిన లింగాలు నేటికీ పూజలందుకుంటున్నాయి. పలువురు దాతల సహకారంతో చాలా ఏళ్ల తర్వాత ఆలయాన్ని శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబు చేస్తున్నారు. ఈనెల 17న ఉత్సవాలకు అంకురార్పణ అదే రోజు సాయంత్రం గిరిజాశంకర కల్యాణోత్సవంతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 18న మహాశివరాత్రి అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. 20న పల్లకీ ఉత్సవం, 21న పుష్పయాగోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ అర్చకులు శంకరనారాయణ దీక్షితులు, బాలసుబ్రహ్మణ్యం తెలిపారు.

రోటరీ సేవలపై విదేశీయుల ప్రశంస



మహిళలకు టైలరింగ్ అర్హత పత్రాలు అందించిన దృశ్యం

పావగడ: స్థానిక రోటరీ సంస్థ చేపడుతున్న సామాజిక సేవలపై విదేశీయుల బృందం ప్రశంసల వర్షం కురిపించింది. బెంగళూరు సదాశివ రోటరీ సంస్థ ఆధ్వర్యంలో విదేశీయుల బృందం శనివారం పావగడలో పర్యటించింది. రోటరీ క్లబ్‌లో ఉచితంగా టైలరింగ్ శిక్షణ పొందిన పేద మహిళలకు అర్హత పత్రాలు అందించారు. ఈ సందర్భంగా తాలూకాలోని కృష్ణగిరి గ్రామం చుట్టుపక్కల నిర్మించిన చెక్ డ్యాంలను ఇంగ్లాండ్‌కు చెందిన డిక్టర్, యూకేకు చెందిన రొటేరియన్ రిబిత్ గ్రీన్, బెంగళూరుకు చెందిన రొటేరియన్ సుదర్శన్ రెడ్డి పరిశీలించారు. స్థానిక రోటరీ సంస్థ పదాధికారులను ప్రశంసించారు. మరో రెండు చెక్ డ్యాంల నిర్మాణాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. స్థానిక శనీశ్వర దేవాలయం, నాగలమడకలోని అంత్య సుబ్రహ్మణ్య స్వామి దేవాలయాలను సందర్శించారు. ఆలయాల్లో పూజలు చేయించారు. అనంతరం తిరుమణి సోలార్ పార్క్‌లోని బ్లాక్ 40లో నిర్మించిన స్ప్రింగ్ ఎనర్జీని తిలకించారు. కార్యక్రమంలో స్థానిక రోటరీ క్లబ్ అధ్యక్షుడు పురుషోత్తమ రెడ్డి, కార్యదర్శి సత్య లోకేశ్ తదితర రొటేరియన్లు పాల్గొన్నారు.

బెస్ట్ యూనివర్సిటీపై చర్యలు తీసుకోండి

హిందూపురం టౌన్: గోరంట్లలోని బెస్ట్ అగ్రికల్చర్ యూనివర్శిటీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్, సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఆత్మహత్యాయత్నం చేసి, హిందూపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న బెస్ట్ అగ్రికల్చర్ యూనివర్సిటీ విద్యార్థి మనోహర్‌ను శనివారం వారు పరామర్శించారు. యాజమాన్యం అక్రమంగా అధిక ఫీజులు వసూలు చేయడం, విద్యార్థులు యాజమాన్యంపై ప్రశ్నిస్తే వారిని సస్పెండ్ చేయడం, ఇష్టానుసారం ఫైన్‌లు విధించడం చేస్తున్నారన్నారు. విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తూ ప్రశ్నిస్తే ఎక్కడ సస్పెండ్ చేస్తారనే మానసిక ఒత్తిడికి గురై విద్యార్థి మనోహర్ ఆత్మహత్యాయత్నం చేశాడన్నారు. యాజమాన్యమే అతడిని ఆత్మహత్యకు ప్రేరేపించిందన్నారు. యూనివర్సిటీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్, సీపీఐ నాయకులు వినోద్‌కుమార్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మనుధర్మశాస్త్రం ప్రతుల దగ్ధం

మడకశిర: పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో శనివారం దళిత హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మనుధర్మశాస్త్రం ప్రతులను దగ్ధం చేశారు. ప్రజలను మనుధర్మశాస్త్రం అష్టకష్టాలకు గురి చేసిందన్నారు. అంటరానితనానికి ఈ శాస్త్రం కారణమైందని ధ్వజమెత్తారు. ఇలాంటి మనుధర్మ శాస్త్రం గ్రంథాన్ని పాలకులు హైదరాబాద్‌లో ఆవిష్కరించడం సరికాదన్నారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ అధ్యక్షుడు హనుమంతు, ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు శ్రీనివాస్, రఘునాథ్, మోతిరాం నాయక్, అంజి, మల్లికార్జున, రామాంజి, రంగస్వామి, హనుమంతు, నరసింహ రాజు పాల్గొన్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు

రొళ్ల: మండలంలో అటవీ ప్రాంతాల్లోనే వంకల నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చర్యలు తప్పవని ఇన్‌చార్జ్ అటవీశాఖ అధికారి కుళ్లాయప్ప శనివారం సాయంత్రం తెలిపారు. రొళ్ల, హొట్టేబెట్ట, బీజీ హళ్లి పంచాయతీల సరిహద్దు అటవీ ప్రాంతం నుంచి రాత్రి వేళలో కొందరు వ్యాపారులు ట్రాక్టర్ల సహాయంతో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. సంబంధిత వ్యాపారులు అటవీ ప్రాంతంలోని వంక నుంచి అక్రమ ఇసుకను తరలించినట్లు తెలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇక నుంచి రాత్రి వేళల్లో సిబ్బందితో కలిసి గస్తీ తిరుగుతామని తెలిపారు. అక్రమ ఇసుక తరలింపుపై సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు.

పండిత్ దీన్ దయాళ్‌కు ఘన నివాళి



పండిత్ దీన్ దయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: మండల పరిధిలోని మెళవాయి గ్రామంలో శనివారం బీజేపీ నాయకులు జన సంఘ్ వ్యవస్థాపకుడు, సిద్ధాంతకర్త పండింత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా దీన్ దయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాయలసీమ బీజేపీ కిసాన్ మోర్చా జోనల్ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్, నాయకులు నాగరాజు, దొడ్డరంగేగౌడు, గుప్తా, చిదనందనాయుడు, నారాయణప్ప, రంగప్ప, నాగేంద్ర, పెన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం టౌన్: స్థానిక వీవర్స్ కాలనీలో శనివారం పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. దీన్ దయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. ఏకాత్మత మానవతా వాదాన్ని బీజేపీకి అందించిన సిద్ధాంతకర్త పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ అన్నారు. ఆయన వర్ధంతిని ప్రతి సంవత్సరం బీజేపీ సమర్పణ దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. జనసంఘ్ వ్యవస్థాపకుల్లో ఒకరైన ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు రాముడు, తిరుమలేష్, శ్రీనివాసులు, పాతలింగ, మూర్తి, చాడప్ప, మహేష్, హనుమంతు పాల్గొన్నారు.

క్రీడాదుస్తుల పంపిణీ



క్రీడాదుస్తులు ధరించిన విద్యార్థులు

లేపాక్షి: ఇటీవల ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి అండర్-9, అండర్-15, అండర్-18 ఫుట్‌బాల్ పోటీల్లో సత్తా చాటిన పులమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం సాయంత్రం క్రీడా దుస్తులు అందజేశారు. గతంలో హిందూపురం పట్టణంలో వన్‌టౌన్ సీఐగా పని చేసిన ఇస్మాయిల్ తండ్రి మహమ్మద్ హనీఫ్ జ్ఞాపకార్థం క్రీడాదుస్తులు అందజేసినట్లు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ మునీర్ అహమ్మద్, హిందూపురం సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు శేఖర్, సర్పంచ్ అశ్వత్థనారాయణ, పాఠశాల కమిటి చైర్మన్ మంజునాథ్, ప్రధానోపాధ్యాయుడు కృష్ణమోహన్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ రామాంజినేయులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రిమాండ్‌కు తరలింపు

పెనుకొండ: పట్టణ సమీపంలోని రాజేశ్వరీ కాలనీకి చెందిన ముగ్గురుని శనివారం సాయంత్రం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రమేష్‌బాబు పేర్కొన్నారు. వారం రోజుల క్రితం కాలనీకి చెందిన హనుమంతప్పపై క్రాంతికుమార్, మారుతిప్రసాద్, ఆదిలక్ష్మి దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నిందితులపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపరచామన్నారు.

రుణాలు రెన్యూవల్ చేసుకోండి

రొళ్ల: స్థానిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో గత ఏడాది పంట రుణాలు తీసుకున్న రైతులు మార్చి 15వ తేదీలోపు 7 శాతం వడ్డీని చెల్లించి రెన్యూవల్ చేసుకోవాలని సహకార సంఘం అధ్యక్షుడు మోతిరాంనాయక్, సీఈఓ హనుమంతరాయ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రుణాలను సకాలంలో రెన్యూవల్ చేసుకున్న రైతులకు వడ్డీ భారం తగ్గుతుందన్నారు. రెన్యూవల్ చేసుకునేందుకు వచ్చే రైతులు 1బీ, రెండు ఫోటోలు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, అకౌంట్ పాసుపుస్తకం జిరాక్స్ కాపీలు తీసుకుని రావాలని సూచించారు.

సిద్ధేశ్వర స్వామికి పూజలు

అమరాపురం: మండల పరిధిలోని హేమావతిలో వెలసిన సిద్ధేశ్వర స్వామికి మాఘమాసం సందర్భంగా శనివారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు సుప్రభాత సేవ, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజలు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హిందూపురం టౌన్: పట్టణంలోని డీ1 ఫీడర్ల పరిధిలో విద్యుత్ సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్ వల్ల ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్ ఏఈ కృష్ణవేణి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని పాండురంగనగర్, కోట, అంబేడ్కర్ నగర్, డీఎల్ రోడ్డు, పెనుకొండ రోడ్డు, ఆబాద్‌పేట, ముక్కడిపేట, ధర్మపురం, బాపూజీనగర్, నంది సర్కిల్, హస్నాబాద్, ప్రభుత్వ ఆస్పత్రి ఏరియా, చిన్నమార్కెట్, ఎంఎఫ్ రోడ్డు, సత్యనారాయణ పేట, ఆజాద్‌నగర్, నింకంపల్లి రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

రేపు క్యాన్సర్ వైద్య శిబిరం

పావగడ: స్థానిక స్వామి వివేకానంద సంఘటిత గ్రామీణ ఆరోగ్య కేంద్రంలో ఈనెల 13వ తేదీన క్యాన్సర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆరోగ్య కేంద్రం నిర్వాహకుడు స్వామి జపానంద శనివారం పేర్కొన్నారు. బెంగళూరు శంకర క్యాన్సర్ ఆస్పత్రి, కర్ణాటక క్యాన్సర్ సొసైటీ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకూ కొనసాగే శిబిరంలో ప్రముఖ వైద్య నిపుణులు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. నిరుపేద రోగులకు విలువైన ఔషధాలను క్యాన్సర్ సొసైటీ ఉచితంగా అందిస్తుందన్నారు. వైద్య చికిత్సలకు వచ్చే వారు ఆధార్‌కార్డులు తీసుకుని రావాలన్నారు.